సాక్షి అనంతపురం

సోమవారం ၊ 27 ၊ మే ၊ 2024



పీజీలో ఉమ్మడి విద్యా ప్రణాళిక

అన్ని యూనివర్సిటీల్లో ఒకే విద్యా ప్రణాళిక అమలు చేయాలని ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకుంది. 8లో



గుంతకల్లులో రేపు జాబ్‌మేళా

గుంతకల్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా జరగనుంది. 3 కంపెనీలు పాల్గొంటున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
35.7°/22.4°

జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత తగ్గింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వడగాల్పులు వీచాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'ఇంటర్న్‌షిప్' ఎవాల్యుయేషన్



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీఎస్సీ ఆరో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఇంటర్న్‌షిప్ ఎవాల్యుయేషన్ (మూల్యాంకనం) ప్రారంభం కానుంది. జూన్ 1న ప్రక్రియ ముగుస్తుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 93 డిగ్రీ కళాశాలల్లో 4,800 మంది విద్యార్థులకు ఎవాల్యుయేషన్ నిర్వహించనున్నారు. తాము వెళ్లిన కంపెనీల్లో ఈ ఆరు నెలల్లో చేపట్టిన ప్రాజెక్టులపై ఎవాల్యుయేషన్ చేస్తారు.ఇందుకు ఒక ఎక్స్‌టర్నల్ నిపుణుడిని ప్రతి డిగ్రీ కళాశాలలోనూ నియమించారు. మూల్యాంకనానికి గరిష్టంగా 200 మార్కులు కేటాయించారు. ఇంటర్నల్ 50, ఎక్స్‌టర్నల్ 150 మార్కులు వేయనున్నారు. ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ నిపుణులు ఇద్దరూ వేర్వేరుగా మార్కులు నిర్ధారిస్తారు.

ప్రముఖ కంపెనీల్లో..

ఉన్నత విద్యలో చేపట్టిన సంస్కరణల్లో భాగంగా డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ను రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి చేసింది. నాలుగేళ్ల డిగ్రీ ఆనర్స్ కోర్సులు అభ్యసించే వారికి ఏడాది ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలను గుర్తించి అందులోనే ప్రాజెక్ట్ పూర్తి చేసేలా చొరవ తీసుకున్నారు. విద్యార్థులు తమకు నచ్చిన కంపెనీలో ఇంటర్న్‌షిప్ చేయడానికి అవకాశం కల్పించారు. ప్రభుత్వం ఎంపిక చేసిన కంపెనీల్లో ఏపీ జెన్‌కో, హ్యుందాయ్, కియా మోటార్స్, విప్రో, అమర రాజా బ్యాటరీస్, కోల్గేట్ పామోలివ్, హీరో మోటార్స్, జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్, ఏపీ పవర్ జనరేషన్ కార్పొరేషన్, హెటిరో ల్యాబ్స్ వంటి ప్రముఖ కంపెనీలు ఉండడం గమనార్హం.

కట్టుదిట్టంగా నిర్వహణ..

ఈ విషయంపై ఎస్కేయూ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ 'సాక్షి'తో మాట్లాడారు. ఇంటర్న్‌షిప్ ఎవాల్యుయేషన్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. గతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మాత్రమే ఎవాల్యుయేషన్ నిర్వహించేవారని, తాజాగా అన్ని కళాశాలల్లోనూ ఏర్పాటు చేయాలని వీసీ ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రక్రియను కట్టుదిట్టంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

రేపటి నుంచి అండర్-19 సౌత్‌జోన్ క్రికెట్ టోర్నీ



టోర్నీలో పాల్గొననున్న జిల్లా జట్టు

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సౌత్ జోన్ అండర్ -19 అంతర్ జిల్లా క్రికెట్ పోటీలు ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నారు. అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో జరగనున్న ఈ టోర్నమెంట్‌లో మొత్తం 5 జిల్లాల జట్లు (అనంతపురం, చిత్తూరు, వైఎస్సార్, కర్నూలు, నెల్లూరు) పాల్గొననున్నాయి. టోర్నీ జూన్ 3న ముగియనుంది. జిల్లా జట్టుకు కోగటం హనీష్ వీరా రెడ్డి కెప్టెన్‌గా, టి. ప్రదీప్ రెడ్డి వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. బి. ప్రశాంత్ (వికెట్ కీపర్), ఏ. జయంత్ కృష్ణ,ఎస్. అజాన్ మహమ్మద్, సి. హర్షవర్ధన్, సీహెచ్ భార్గవ రాజు, పి. మణిదీప్, ఎస్. కరీం బాబా, టీవీ ప్రతాప్ రెడ్డి, శంకర నారాయణ, తన్వీనర్ జమాల్, ఎం. భువనేశ్వర్, నిశ్చయ్, పి. నీలేంద్ర, కే. వెంకట లోకేష్, ఎం. చెన్నకేశవ రెడ్డి జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు. స్టాండ్‌బైలో ఎస్. మనోజ్‌కుమార్, సి. విఘ్నేష్ దినకర్, ఎం. చందు, టి. సందీప్ రెడ్డి, మహమ్మద్ సాహిల్, కే. షరీఫ్, త్రిభువన్ ఉన్నారు.

159 మందిపై రౌడీషీట్

అనంతపురం సెంట్రల్: పోలింగ్ రోజున జిల్లాలోని పలు ప్రాంతాల్లో జరిగిన అల్లర్లు, గొడవలు, దాడుల ఘటనల్లో పాలు పంచుకున్న వారిపై ఎస్పీ గౌతమిశాలి కఠిన చర్యలు తీసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేయాలని ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం జిల్లాలో 159 మందిపై రౌడీషీట్లు ఓపెన్ చేశారు. ఈనెల 13న పోలింగ్ రోజు తాడిపత్రితో పాటు యాడికి మండలం కోనఉప్పలపాడులో గొడవలు తలెత్తాయి. పెద్దవడుగూరు మండలం దిమ్మగుడిలో దివ్యాంగునిపై దాడి జరిగింది. అలాగే, పలు ప్రాంతాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలపై ఇప్పటికే కేసులు నమోదు చేసిన పోలీసులు.. తాజాగా నిందితులపై రౌడీషీట్లు ఓపెన్ చేశారు. తాడిపత్రి అల్లర్లకు సంబంధించి 106 మందిపై, యాడికిలో 37 మంది, పెద్దవడుగూరులో ఏడుగురు,జిల్లాలో ఇతర పోలీసుస్టేషన్లలో 9 మంది ఇలా మొత్తం 159 మందిపై రౌడీషీట్లు తెరిచారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఓట్ల లెక్కింపునకు 954 మంది నియామకం
- ప్రక్రియలో మరో 400 మంది సేవలందిస్తారు
- జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు
- ప్రజాతీర్పును రాజకీయ పార్టీలు, అభ్యర్థులు గౌరవించాలి
- 'సాక్షి'తో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్



సాక్షి ఇంటర్వ్యూ

అనంతపురం అర్బన్: 'ఆరోగ్యకర వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా ప్రతి ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేస్తూ వస్తున్నాం. అదే విధంగా కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపడుతున్నాం. ఓట్ల లెక్కింపునకు 954 మంది సిబ్బందిని నియమించాం. ఈ ప్రక్రియలో మరో 400 మంది పాలు పంచుకుంటారు. కౌంటింగ్ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద, అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. ఎన్నికల నిర్వహణ క్రమంలో ప్రణాళిక రూపొందించుకుని బృందంగా పనిచేయడంతోనే ఇదంతా సాధ్యమవుతోందంటున్న కలెక్టర్‌తో 'సాక్షి' మాటామంతి.

సాక్షి: పోలింగ్ సమర్థవంతంగా జరిపారని భావిస్తున్నారా?

కలెక్టర్: అవును... ఎన్నికల నిర్వహణలో ఇప్పటి వరకు ప్రతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాం. నాతో మొదలు గ్రామస్థాయి అధికారి వరకు సమన్వయం అనేది చాలా ముఖ్యం. అధికారులకు ఒక డైరెక్షన్ ఇవ్వడంతో పాటు ఆ ప్రకారం జరుగుతోందా అనేది చూసుకోవాల్సిన బాధ్యత కలెక్టర్‌ది. దీన్ని జిల్లాలో పక్కాగా అమలు చేశాం. ఎప్పటికప్పుడు జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి తగిన సూచనలు, ఆదేశాలు ఇస్తూ వచ్చాం. ఎన్నికల్లో భాగమైన చివరి స్థాయి ఉద్యోగి వరకు అందరూ స్పష్టతతో పనిచేసేలా చూశాం. ఎన్నికల విధుల నిర్వహణలో ఏదైనా సందేహం వచ్చినప్పుడు కిందస్థాయి నుంచి పై స్థాయి అధికారి వరకు ఎలాంటి బెరుకూ లేకుండా నేరుగా కలెక్టర్‌ను సంప్రదించే స్వేచ్ఛ కల్పించాం. నిర్ణయాలు తీసుకునే విషయంలోనూ అధికారులకు స్వేచ్ఛ ఇచ్చాం. ఇలా టీమ్‌వర్క్‌గా అధికారులంతా ఆత్మవిశ్వాసంతో పనిచేశాం. పోలింగ్‌ను సమర్థవంతంగా పూర్తి చేశాం.

సాక్షి: ఎక్కడా సమస్యలు ఉత్పన్నం కాలేదా?

కలెక్టర్: ఎన్నికల నిర్వహణలో ప్రతి అంశానికి ప్రణాళిక రూపొందించుకుని అమలు చేస్తూ వస్తున్నాం. ముఖ్యంగా హడావుడి ఉండకుండా చూసుకున్నాం. ఏ పనీ ఆఖరు నిమిషం వరకు పెండింగ్ ఉండకుండా చూశాం. రేపు చేయాల్సిన పనికూడా ఈ రోజే పూర్తి చేసుకుంటూ వచ్చాం. నియోజకవర్గాల పర్యవేక్షణ బాధ్యతలను ఐఏఎస్ అధికారులకు అప్పగించాం. జాయింట్ కలెక్టర్‌కు ఉరవకొండ, గుంతకల్లు బాధ్యతలు, జెడ్పీ సీఈఓకు రాయదుర్గం, కళ్యాణదుర్గం, రాప్తాడు బాధ్యతలు, నగర పాలక కమిషనర్‌కు అనంతపురం అర్బన్, శింగనమల, తాడిపత్రి బాధ్యతలు అప్పగించాం. ఏవేని సమస్యలు వస్తే అక్కడికక్కడే పరిష్కరించుకునేలా చూశాం.

కౌంటింగ్ సిబ్బంది ఇలా				
కౌంటింగ్	అదనపు ఏఆర్ఓలు	కౌంటింగ్ సూపర్‌వైజర్లు	కౌంటింగ్ అసిస్టెంట్లు	సూక్ష్మ పరిశీలకులు
పార్లమెంట్ పోస్టల్ బ్యాలెట్	20	20	40	20
అసెంబ్లీ పోస్టల్ బ్యాలెట్	34	34	68	34
అసెంబ్లీ ఓట్లు	-	116	116	116
పార్లమెంట్ ఓట్లు	-	112	112	112

సాక్షి: కౌంటింగ్‌కు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

కలెక్టర్: కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నాం. ఓట్ల లెక్కింపునకు 954 మంది కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, సూక్ష్మ పరిశీలకులు, అదనపు ఆర్‌ఓలను నియమించాం. వీరు కాకుండా మరో 400 మంది సేవలను వినియోగించుకుంటాం.

సాక్షి: పోలీసు బందోబస్తు గురించి..?

కలెక్టర్: కౌంటింగ్ కేంద్రాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నాం. ఈవీఎంలు ఉంచిన జేఎన్‌టీయూలో సీసీ కెమెరాల పర్యవేక్షణ నేరుగా ఎస్పీ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి జరిగేలా ఏర్పాటు చేశాం. ఇక జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంది. ఆయుధాలు, కర్రలు, రాళ్లు, తదితర వస్తువులు అక్రమంగా కలిగి ఉండకుండా 133 సెక్షన్ అమలు చేస్తున్నాం. బాణా సంచా వినియోగంపై నిషేధం విధించాం. కౌంటింగ్ పూర్తైన తరువాత అభ్యర్థులను పోలీసు బందోబస్తుతో వారి ఇళ్లకు చేరుస్తాం. ఊరేగింపులు, విజయోత్సవాలు నిర్వహించేందుకు అనుమతి లేదు. కౌంటింగ్ తరువాత జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జూన్ 25 వరకు కేంద్ర బలగాలు బందోబస్తు ఉంటుంది.

సాక్షి: అభ్యర్థులకు మీరిచ్చే సందేశం..

కలెక్టర్: ప్రజా తీర్పును అభ్యర్థులు, పార్టీలు గౌరవించాలి. స్వాగతించాలి. గెలుపోటములను సమానంగా తీసుకోవాలి.



సాక్షి: రాజకీయ పార్టీల సహకారం ఎలా ఉంది...?

కలెక్టర్: రాజకీయ పార్టీల నుంచి పూర్తి సహకారం అందింది. వారితో ఎప్పటికప్పుడు సమావేశం నిర్వహిస్తూ జిల్లా యంత్రాంగం ఏం చేస్తోందనేది వివరించాం. వారి నుంచి అందే ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకున్నాం. ప్రతి అంశంలోనూ పారదర్శకంగా వ్యవహరిస్తూ వారి సందేహాలు నివృత్తి చేస్తూ వచ్చాం. వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నాం.

ఆన్‌లైన్ మూల్యాంకనం జాగ్రత్తగా నిర్వహించాలి

- అధ్యాపకులకు రెండో విడత శిక్షణ



ఆన్‌లైన్ శిక్షణకు హాజరైన జిల్లాలోని అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబు పత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనం ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని ఇంటర్ బోర్డు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ వి.సుబ్బారావు సూచించారు. ఇంటర్ బోర్డు చరిత్రలో తొలిసారి చేపడుతున్న ఆన్‌లైన్ మూల్యాంకనానికి సంబంధించి అధ్యాపకులకు ఆదివారం స్థానిక కొత్తూరు బాలుర ఒకేషనల్ జూనియర్ కళాశాలలో రెండోవిడత శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల కళాశాలల నుంచి 200 మంది అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వ యాజమాన్యాల కళాశాలల అధ్యాపకులు హాజరుకాకపోతే సంబంధిత ప్రిన్సిపాళ్లదే బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులు హాజరుకాకపోతే యాజమాన్యాలదే బాధ్యత అన్నారు. ప్రభుత్వ గుర్తింపు రద్దు చేస్తామని హెచ్చరించారు. సెల్‌ఫోన్, ట్యాబ్‌లలో జవాబుపత్రాలు ఓపెన్‌కావని స్పష్టం చేశారు. ఇంటర్నెట్ సెంటర్లలో వాల్యూయేషన్ చేయకూడదన్నారు. వ్యక్తిగత ల్యాప్‌ట్యాప్ లేదా కళాశాలల్లో వెబ్ కెమెరా సదుపాయం ఉన్న డెస్క్‌టాప్ కంప్యూటర్లలో ఓపెన్ చేసుకోవాలన్నారు. వాల్యూయేషన్ సమయంలో సంబంధిత అధ్యాపకుడు తప్ప ఇతరులెవరూ కనిపించకూడదన్నారు. ఆ సమయంలో ఫొటోలు తీయకూడదని, వీడియో రికార్డ్ చేయరాదన్నారు. అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శిక్షణలో జిల్లా నుంచి పరీక్షల నిర్వహణ కమిటీ జిల్లా కన్వీనర్, ఆర్ఐఓ ఎం.వెంకటరమణనాయక్, డీఈసీ సభ్యులు డి.శంకరయ్య, మహమ్మద్‌షఫి, డి.జగన్నాథ్ పాల్గొన్నారు.

డెంగీతో జాగ్రత్త



అనంతపురంలో డెంగీ పాజిటివ్ కేసు బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న వైద్యారోగ్య శాఖ అధికారులు

- జిల్లాలో 32 కేసుల నమోదు
- అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు
- లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయరాదని సూచన

అనంతపురం మెడికల్: జిల్లాలో డెంగీ జ్వరం ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 32 మందికి డెంగీ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. రెండు మలేరియా కేసులు కూడా నమోదయ్యాయి. పట్టణాల్లోనే కేసులు నమోదవుతున్నాయి. అనంతపురం, ఉరవకొండ, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తి, రాప్తాడు ప్రాంతాల్లో డెంగీ బాధితులను గుర్తించారు.

అధికారుల అప్రమత్తం..

డెంగీ, మలేరియా కేసులు వెలుగు చూడడంతో ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి ఆదేశాలతో మలేరియా అధికారి ఓబులు పర్యవేక్షణలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, గుత్తిలోని వివిధ ప్రాంతాలను డెంగీ ప్రభావితమైనగా గుర్తించారు. ఆయా చోట్ల లార్వా నిర్మూలన చర్యలు చేపడుతున్నారు. స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు.

గత ఐదేళ్లలో డెంగీ కేసుల వివరాలిలా..		
ఏడాది	రక్త పరీక్షల సంఖ్య	పాజిటివ్స్
2020	3,767	77
2021	10,816	132
2022	10,672	273
2023	8,734	171
ఈ ఏడాది మే 26 వరకు	2,116	32

ప్రైవేట్ మాయలో పడొద్దు..

సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో జిల్లాలో కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, కొందరు ఆర్‌ఎంపీలకు భలే గిరాకీ. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కళ్ల నొప్పి తదితర లక్షణాలు కనిపిస్తే డెంగీ అంటూ ప్రచారం చేయడంతో పాటు రక్త పరీక్షలు, వివిధ కారణాలను చూపి రూ. వేలల్లో డబ్బు వసూలు చేస్తారు. అయితే, ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో చూపించుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ఉచితంగా డెంగీ నిర్ధారణ పరీక్షలు, మందులు అందిస్తారని తెలిపారు. అనంతపురంలోని సర్వజనాస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీ, సీడీ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తారన్నారు. సర్వజనాస్పత్రిలో ప్లేట్‌లెట్స్ ఎక్కించే సదుపాయం కూడా ఉందని పేర్కొన్నారు.



గ్రామీణులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)

మూడు నెలల పాటు స్పెషల్ డ్రైవ్

డెంగీ, మలేరియా కేసులు నమోదైన ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాం. మలేరియా సబ్ యూనిట్ అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి, దోమకాటు నివారణ చర్యలపై ఆశా, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించాం. పాజిటివ్ కేసులు నమోదైన ప్రాంతాల్లో 8 వారాల పాటు యాంటీ లార్వా, ఐఆర్ఎస్ పద్ధతుల్లో భాగంగా ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయిస్తున్నాం. రానున్న మూడు నెలలు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పిస్తాం.

– ఓబులు, జిల్లా మలేరియా అధికారి

నిర్లక్ష్యం చేయొద్దు



వర్షాకాలంలో దోమకాటు వ్యాధులు అధికమయ్యే అవకాశం ఉంది. జ్వరం, ఒళ్లు నొప్పులు, తలనొప్పి, కడుపునొప్పి, వాంతులు, ఉబ్బరం, నీరసంగా ఉండడం తదితర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయరాదు. సమస్య తీవ్రమైనప్పుడు ఫిట్స్, ఆయాసం, శరీరంపై దద్దుర్లు వచ్చే అవకాశం ఉంటుంది. ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇళ్లలో సురక్షిత ప్రమాణాలు పాటించాలి. సర్వజనాస్పత్రిలో ఎలీసా రీడర్, ప్లేట్‌లెట్స్ ఎక్కించే సదుపాయం ఉంది. సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, సర్వజనాస్పత్రి

అనుకున్న దాని కన్నా అధిక'మే'



- మే నెలలో సాధారణం కన్నా 300 శాతం ఎక్కువ వర్షాలు
- 36.7 మి.మీకి గానూ ఇప్పటికే 105 మి.మీ వర్షపాతం

అనంతపురం అగ్రికల్చర్: ఊహించని విధంగా మే నెలలో మేఘాలు బాగా వర్షించాయి.'ముంగారు'కు ముందస్తుగా జిల్లా అంతటా తొలకర్లు మురిపించాయి. ఈ సారి వేసవిలో మునుపెన్నడూ లేనంతగా రెండు నెలల పాటు 42 నుంచి 45 డిగ్రీలతో భానుడు భగభగలాడించాడు. డిసెంబర్ నుంచి వాన చినుకు నేల రాలలేదు. నాలుగు నెలల పాటు ఒక్క మి.మీ వర్షపాతం కూడా నమోదు కాలేదు. ఇలాంటి పరిస్థితిలో మొదటి సారిగా మే 8న వరుణుడు కరుణించాడు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా జిల్లా అంతటా తొలకర్లు నమోదవుతున్నాయి. మే 8వ తేదీన 14.6 మి.మీ, 20న 20.7 మి.మీ, 21న 12.5 మి.మీ, 25న 22.3 మి.మీ ఇలా జిల్లా అంతటా వర్షపాతం నమోదైంది. కొన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. మేలో సాధారణ వర్షపాతం 36.7 మి.మీ కాగా ఇంకా నాలుగు రోజులు ఉండగానే 300 శాతం అధికంగా 105 మి.మీ వర్షపాతం నమోదైంది. చాన్నాళ్ల తర్వాత వాగులు, వంకలు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లాయి. గతంలో చూస్తే 2004 మే నెలలో అత్యధికంగా 125.2 మి.మీ వర్షపాతం నమోదైంది. సరిగ్గా 20 యేళ్ల తర్వాత ఈ ఏడాది మే నెలలో 105 మి.మీ నమోదు కావడం విశేషం. గత వంద సంవత్సరాల చరిత్ర తీసుకున్నా కేవలం ఆరు సార్లు మాత్రమే మే నెలలో 100 మి.మీ అంతకన్నా ఎక్కువగా వర్షపాతం నమోదైంది. పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, పుట్లూరు, యల్లనూరు, నార్పల, తాడిపత్రి మండలాలు మినహా మిగతా మండలాల్లో మే నెలలో భారీ వర్షాలు నమోదయ్యాయి. ఉరవకొండ మండలంలో ఏకంగా 206 మి.మీ వర్షం కురిసింది. వర్షాలతో ఉద్యాన పంటలు, పట్టు, పాడి పశుపోషణ, పశుగ్రాసానికి ఇబ్బంది లేకుండా పోయిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం..

తొలకరి వర్షాలు జిల్లా అంతటా నమోదు కావడంతో అన్నదాత 'ముంగారు' సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలను ఉపయోగించుకుని దుక్కులు చేసుకుంటున్నారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ ఖరీఫ్‌లో 3.46 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రావచ్చని అంచనా వేశారు. ఖరీఫ్ పెట్టుబడులకు రైతులు ఇబ్బంది పడకుండా ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం రూ.251 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ వారి ఖాతాల్లో జమ చేసింది. అలాగే 40 శాతం రాయితీతో ఆర్‌బీకే వేదికగా నాణ్యమైన విత్తన వేరుశనగ అందిస్తున్నారు. మరో పక్క బ్యాంకుల ద్వారా పంట రుణాల రెన్యువల్స్, కొత్త రుణాల పంపిణీ జరుగుతోంది. ఇలా పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో అన్నదాత హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

కసాపురంలో రేపటి నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు ఈనెల 28 నుంచి ప్రారంభం కానున్నాయి. 5 రోజుల పాటు అత్యంత వైభవంగా సాగనున్నాయి. మొదటి రోజు మంగళవారం స్వామికి పుష్పాలంకరణ సేవ ఉంటుంది. బెంగళూరు నుంచి తెప్పించే ప్రత్యేక పుష్పాలతో స్వామిని సర్వాంగసుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.అదేరోజు సాయంత్రం ఆలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి తులసీదళాలతో లక్షార్చన నిర్వహిస్తారు. బుధవారం స్వామివారిని గంధాలంకరణలో తీర్చిదిద్దుతారు. సాయంత్రం ఉత్సవ మూర్తికి తమలపాకులతో లక్షార్చన ఉంటుంది. గురువారం స్వామిని డ్రైఫ్రూట్స్‌తో అలంకరిస్తారు. సాయంత్రం 6 గంటలకు ఉత్సవ మూర్తికి సింధూరంతో లక్షార్చన నిర్వహిస్తారు. శుక్రవారం 108 కలశాలతో అభిషేక సేవ చేస్తారు. అనంతరం వివిధ రకాల పండ్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఆ రోజు సాయంత్రం ఉత్సవ మూర్తికి మల్లెపూలతో లక్షార్చన నిర్వహిస్తారు. జూన్ 1న హనుమజ్జయంతి సందర్భంగా స్వర్ణ వజ్రకవచ అలంకరణలో స్వామి భక్తులను కటాక్షించనున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించి, ఉత్సవాలకు ముగింపు పలుకుతారు. సాయంత్రం 5 గంటలకు నెట్టికంటి ఆంజనేయస్వామిని ఒంటె వాహనంపై కొలువుదీర్చి పురవీధుల్లో ప్రాకారోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు ఆలయ ఈఓ భద్రాజీ తెలిపారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో 108 కలశాలను ఉంచి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. లక్షార్చన సేవకు రూ.1,116, హోమాల్లో పాల్గొనదలచిన భక్తులు రూ.2,500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


తిరుపతి నాయుడు (ఫైల్)

పుట్లూరు: ప్రమాద వశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం కోమటికుంట్లకు చెందిన చెరుకూరి తిరుపతినాయుడు (60) తనకున్న ఏడు ఎకరాల్లో చీనీ, అరటి సాగు చేపట్టారు. శనివారం రాత్రి పంటకు నీటి తడులు ఇచ్చేందుకు వెళ్లిన ఆయన బోరు బావి వద్ద మోటార్ స్విచ్ఛాన్ చేస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ హేమాద్రి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య రంగమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బీటీపీకి పెరుగుతున్న ఇన్‌ఫ్లో

గుమ్మఘట్ట: రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాలకు వరదాయినిగా ఉన్న భైరవానితిప్ప ప్రాజెక్టుకు క్రమంగా ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ఈ మేరకు జలవనరుల శాఖ ఏఈ హరీష్ ఆదివారం వెల్లడించారు. పూర్తి స్థాయి నీటి మట్టం 1,655 అడుగులు కాగా, ప్రస్తుత 1,642 అడుగులకు చేరుకుంది. ప్రాజెక్ట్ ఉపరితలంలోని కర్ణాటకలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్ట్‌కు 360 క్యూసెక్కుల వరద చేరుతోంది.

లారీ ఢీ - యువకుడి మృతి


రంజిత్‌కుమార్ గౌడ్ (ఫైల్)

గుత్తి రూరల్: స్థానిక జాతీయ రహదారిపై లారీ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... తొండపాడు గ్రామానికి చెందిన రంగస్వామి, సువర్ణ దంపతుల కుమారుడు రంజిత్ కుమార్ గౌడ్(19) క్యాటరింగ్ సర్వీసు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పనిలో భాగంగా తొండపాడుకు చెందిన కల్యాణ్, హరినాథ్ గౌడ్‌తో కలసి ఆదివారం బాచుపల్లి వద్ద వెలసిన బాట సుంకులమ్మ ఆలయం వద్దకు క్యాటరింగ్ సర్వీస్ చేసేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఎంగిలిబండ గ్రామ శివారులోకి చేరుకోగానే 67వ జాతీయ రహదారిపై పెట్రోల్ బంక్ ఎదురుగా తాడిపత్రి వైపుగా వెళ్తున్న లారీ ఎదురుగా వెళ్తున్న మరో లారీని ఓవర్ టేక్ చేసే క్రమంలో వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది.ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురినీ స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం రంజిత్, కళ్యాణ్‌ను కర్నూలుకు, హరినాథ్‌ను అనంతపురానికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆస్పత్రిలో రంజిత్‌కుమార్ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పీజీలో ఉమ్మడి విద్యా ప్రణాళిక

- ఉన్నత విద్యామండలి నిర్ణయం
- అన్ని వర్సిటీల్లోనూ ఒకే విద్యా ప్రణాళిక ఉండేలా చర్యలు
- ప్రతి వర్సిటీకి మూడు సబ్జెక్టుల్లో పీజీ సిలబస్ రూపకల్పన బాధ్యత
- ఎస్కేయూకు పొలిటికల్ సైన్సెస్, లైబ్రరీ సైన్సెస్, హిస్టరీ సబ్జెక్టుల కేటాయింపు



అనంతపురం: విద్యా ప్రమాణాల పెంపునకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ఏపీ సర్కార్ తాజాగా పీజీ కోర్సుల వైపు దృష్టి సారించింది. ఇప్పటికే అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ)లో రాష్ట్రమంతటా ఒకే విద్యా ప్రణాళిక అమలు చేసిన సంగతి విదితమే. తాజాగా రాష్ట్రంలోని అన్ని వర్సిటీల్లోనూ పీజీ ప్రోగ్రామ్స్‌ల్లో ఉమ్మడి విద్యా ప్రణాళిక అమలు చేయనున్నారు. దీంతో ఇకపై ఏ వర్సిటీలో చదివినా ఒకే రకమైన సిలబస్ ఉంటుంది.

గతానికంటే భిన్నంగా..

గతంలో వర్సిటీల్లో పీజీ ప్రోగ్రామ్స్‌ల్లో ఆయా వర్సిటీల బోర్డు ఆఫ్ చైర్మన్లు నిర్దేశించిన మేరకే సిలబస్‌ను అమలు చేసేవారు. దీంతో ఒక్కో వర్సిటీలో ఒక్కో తరహా సిలబస్ అమలవుతూ వచ్చింది. ఈ నేపథ్యంలో పీజీ కోర్సు పూర్తి చేసినా, ఒక వర్సిటీకి మరో వర్సిటీకి పొంతన లేని పరిస్థితి ఉండేది. తద్వారా నెట్ (నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్), సెట్ (స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్) వంటి పోటీ పరీక్షల్లో విద్యార్థులు రాణించలేక చతికిల పడేవారు. మరోవైపు ఇష్టానుసారంగా సిలబస్‌ను నిర్ధారించి అనవసరమైన అంశాలు ఎక్కువగా పొందుపరచడంతో కోర్సు పూర్తి తర్వాత విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ఉన్నత విద్యా మండలి ఉమ్మడి సిలబస్‌ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి వర్సిటీలకు సూచనలు చేసింది.

ఎస్కేయూకు మూడు సబ్జెక్టులు..

రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో వర్సిటీకి మూడు పీజీ ప్రోగ్రామ్స్‌ల్లో విద్యాప్రణాళిక రూపకల్పన చేసేలా ఉన్నత విద్యా మండలి దిశా నిర్దేశం చేసింది. ఈ మేరకు శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి మూడు సబ్జెక్టులు కేటాయించారు. హిస్టరీ, పొలిటికల్ సైన్సెస్, లైబ్రరీ సైన్సెస్ సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్ ఖరారు కావడంతో ఆయా విభాగాల ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమక్షంలో సిలబస్‌కు రూపకల్పన చేశారు. ఇదే తరహాలోనే కేటాయించిన మేరకు ఆయా వర్సిటీలు సిలబస్‌కు రూపకల్పన చేశాయి..

డిగ్రీ కోర్సుల్లో విజయవంతం..

గతంలో డిగ్రీ కోర్సుల్లోనూ ఆయా వర్సిటీలు వేర్వేరుగా సిలబస్‌ను అమలుచేస్తూ వచ్చాయి. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మేరకు ఉన్నత విద్యామండలి సూచనతో రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ కోర్సుల్లోనూ ఉమ్మడి సిలబస్ విధానం అమలు అవుతోంది. ఈ సంస్కరణలు విజయవంతమయ్యాయి. అంతేకాక డిగ్రీలోనే ఉపాధి కల్పన కోర్సులు అందుబాటులోకి వచ్చినట్లైంది. సింగిల్ సబ్జెక్టు మేజర్‌గా ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకూ యూజీలో మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యా బోధన సాగుతుండగా, ఇకపై మేజర్ సబ్జెక్టు ఒక్కటే ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగనుంది. 2023-24 విద్యా సంవత్సరం నుంచే డిగ్రీ మొదటి సంవత్సరం, 1,2 సెమిస్టర్లలో ఈ కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. గతంలో బీఎస్సీ ఎంపీసీలో మూడు సబ్జెక్టుల కాంబినేషన్ ఉండగా, వాటి స్థానంలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఏదో ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకుని డిగ్రీలో అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. రెండో సెమిస్టర్‌లో దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. తద్వారా మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్యను పూర్తి చేసేలా సమూల మార్పులు చేశారు.

'పీజీ'లోనూ సమూల మార్పులు..

పీజీ సిలబస్‌తో పాటు కోర్సు విధానంలోనూ సమూల మార్పులు చేయనున్నారు. ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) విధానంతో పాటు విద్యార్థి ఆసక్తి మేరకు అంశాలను ఎంపిక చేసుకోవచ్చు. ప్రతి సెమిస్టర్‌కు ఐదు కోర్ సబ్జెక్టుల్లో మూడు కోర్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ఐదు కోర్సుల్లో మూడు కోర్సులు ఎంపిక చేసుకుంటే చాలు. స్కిల్ ఓరియంటెడ్ కోర్సుల విషయంలో ప్రతి కోర్సుకు రెండు ఆప్షన్లు ఉంటాయి. ఇందులో విద్యార్థి ఒక ఆప్షన్ ఎంపిక చేసుకుంటారు. ఓపెన్ ఆన్‌లైన్ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులు స్వయం, ఎన్‌టీపీఎల్ తదితర ఆన్‌లైన్ కోర్సుల నుండి తనకు నచ్చిన ఏదైనా సంబంధిత కోర్సును ఎంచుకోవచ్చు.

సిఫారసుల మేరకే...



ఉన్నత విద్యా మండలి సిఫారసుల మేరకు హిస్టరీ, పొలిటికల్ సైన్సెస్, లైబ్రరీ సైన్సెస్ సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్‌ను ఎస్కేయూకు కేటాయించారు. ఈ మూడు పీజీ సబ్జెక్టులకు సంబంధించిన సిలబస్ రూపకల్పన పూర్తయింది. బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశంతో పాటు అకడమిక్ సెనెట్ ఆమోదం పొందిన అనంతరం ఈ సిలబస్ అమల్లోకి రానుంది.

– డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి, వీసీ, ఎస్కేయూ

చిరుత జాడ కోసం గాలింపు


చిరుత కోసం స్థానిక యువకులతో కలసి గాలిస్తున్న అటవీశాఖ అధికారులు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామంలో చిరుత జాడ కోసం అటవీశాఖ అధికారులు రమేష్, తిమ్మప్ప శనివారం అర్ధరాత్రి ముమ్మర గాలింపు చేపట్టారు. గ్రామ శివారులోని క్రషర్ వద్ద కుక్కను చిరుత తరముకుంటూ వచ్చి నోట కరుచుకుని వెళ్లడాన్ని ఊబిచెర్లకు చెందిన టిప్పర్ డ్రైవర్లు రామయ్య, రాజశేఖర్ చూసి, వెంటనే గ్రామస్తులను అప్రమత్తం చేశారు. దీంతో సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. టార్చ్‌లైట్ వెలుగులో చిరుత పాద ముద్రలను గుర్తించిన అనంతరం వారు మాట్లాడుతూ.. లభ్యమైన గుర్తులను బట్టి శనివారం రాత్రి కనిపించిన జంతువు కచ్చితంగా చిరుత పులిగా నిర్ధారించలేమన్నారు. తోడేలో, హైనానో అయి ఉండవచ్చునన్నారు. అయినా పూర్తి స్థాయిలో గాలింపు చేపట్టి జంతువు ఆచూకీ గుర్తిస్తామన్నారు. అప్పటి వరకూ గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, కొండ పరిసరాల్లోకి ఒంటరిగా వెళ్లరాదని సూచించారు.

పిల్లలను ఉన్నత చదువులు చదివించండి

- రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య


జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం టవర్‌క్లాక్: ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ఉన్నత చదువులు అభ్యసింపజేయాలని బలిజలకు రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య పిలుపునిచ్చారు. బలిజ సామాజిక వర్గానికి చెంది పదో తరగతిలో 550 మార్కులు సాధించిన 106 మంది విద్యార్థులకు ఆదివారం అనంతపురంలోని బాలాజీ కల్యాణమంటపంలో అభినందన సభ నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శంకరయ్య మాట్లాడారు. ఏటా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రాయలసీమ బలిజ మహాసంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేయడం అభినందనీయమన్నారు. కేవలం విద్యతోనే అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బళ్లారి వెంకట్రాముడు, విజయభాస్కర్, రమేష్, సాయి ప్రసాద్, మల్లికార్జున, రమణ, సుబ్బు, కృష్ణమూర్తి, లక్ష్మీప్రసాద్, రామకృష్ణ, చంద్రశేఖర్, పెద్దన్న, రవి కుమార్, ఆదెన్న, పవన్ కుమార్, రామచంద్ర, రంగనాయకులు, దండు శ్రీనివాసులు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

చదరంగంతో మేధోవికాసం


విజేతలతో టోర్నీ నిర్వాహకులు

హిందూపురం: చదరంగం ఆడడం వల్ల మేధో వికాసం పెంపొందుతుందని, విద్యలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు చదరంగం ఎంతో దోహదపడుతుందని డాక్టర్ ఆఫ్తాబ్ అన్నారు. స్పార్టాన్ చెస్ అకాడమి, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో హిందూపురంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి మహిళా చెస్ చాంపియన్‌షిప్- 2024 పోటీలు ఆదివారం ముగిసాయి. స్విస్ లీగ్ పద్ధతిలో మొత్తం ఆరు రౌండ్లలో నిర్వహించిన ఈ పోటీలకు 45 మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. గుంటూరు జిల్లా సి.వైష్ణవి 5.5/6 పాయింట్లతో విజేతగా నిలిచింది. రన్నరప్ స్థానాన్ని తిరుపతి జిల్లా బిల్వనిలయ, మూడో స్థానాన్ని వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన త్రిపురాంబిక, నాల్గో స్థానాన్ని కటారి సజోత్స్న దక్కించుకున్నారు. విజేతలను అభినందిస్తూ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను ముఖ్యఅతిథులు అందజేశారు. ప్రతిభ చాటిన క్రీడాకారులు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ తరఫున ప్రాతినిథ్యం వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ నాగార్జున కర్ణాటకమ్ తెలిపారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ఆర్బిటర్, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ ఎ.ఉదయ్‌కుమార్ నాయుడు, టోర్నీ డైరెక్టర్, చెస్ కోచ్ ఆరీఫ్ వుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

'డ్రిప్'లో 'యాసిడ్' తప్పనిసరి

- ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్


యాసిడ్ ట్రీట్‌మెంట్‌లో భాగంగా ఆమ్ల శాతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్ పరికరాలు ఎక్కువ కాలం మన్నిక రావాలంటే తప్పనిసరిగా యాసిడ్ ట్రీట్‌మెంట్ (ఆమ్ల చికిత్స) చేసుకోవాలని రైతులకు ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్ సూచించారు. ఇందు కోసం ఏ కంపెనీకి చెందిన డ్రిప్ యూనిట్లు అమర్చుకున్నారో సదరు కంపెనీ టెక్నీషియన్ల సహకారం తీసుకోవాలన్నారు. ప్రస్తుతం చుట్టిపెట్టిన ల్యాటరల్‌ను తిరిగి పంటకు వాడకానికి ముందుగా యాసిడ్ ట్రీట్‌మెంట్ చేసుకోవాలన్నారు. డ్రిప్ పరికరాల్లో ఉన్న లీకేజీలను, ఉప్పు లవణాలతో మూసుకుపోయిన లాటర్లను సరిచేసేందుకు ఇదే సరైన సమయమన్నారు. ఫాస్పారిక్ యాసిడ్‌తో ఆమ్ల చికిత్స చేసుకుంటే ఫాస్పరస్ అనే పోషకం భూమికి అందుతుందన్నారు. అది అందుబాటులో లేకపోతే గాఢత లేని సల్ఫ్యూరిక్ యాసిడ్, నైట్రిక్ యాసిడ్, హైడ్రోక్లోరిక్‌యాసిడ్ లాంటి వాటిని కూడా ఉపయోగించవచ్చునన్నారు. నీటిలో ఉండే లవణాల శాతాన్ని బట్టి పీహెచ్ పేపర్ సాయంతో యాసిడ్ మోతాదును పరీక్షించిన తర్వాతనే వినియోగించాలన్నారు. నీటి స్వభావాన్ని బట్టి, డ్రిప్ పైపుల పరిమాణాన్ని బట్టి 10 నుంచి 15 లీటర్ల యాసిడ్‌ను డ్రిప్ వెంచురీ ద్వారా పంపాల్సి ఉంటుందన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ యాసిడ్‌ను నేరుగా పంపకూడదన్నారు. యాసిడ్ ట్రీట్‌మెంట్‌కు అన్నీ ప్లాస్టిక్ వస్తువులే వినియోగించాలని, చేతికి గ్లౌజులు, ముఖానికి మాస్కులు, కంటి అద్దాలు, ప్లాస్టిక్ బూట్లు వేసుకున్న తర్వాతనే ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. ట్రీట్‌మెంట్ పూర్తయిన తర్వాత 30 నిమిషాలు ఫ్లష్‌వాల్వ్‌ను తెరచి రన్ చేయాలన్నారు. తద్వారా డ్రిప్ పైపుల్లో ఉండే యాసిడ్ మొత్తం బయటకు వచ్చేస్తుందని, ఈ ట్రీట్‌మెంట్ చేసిన వారం రోజుల తర్వాత డ్రిప్ పరికరాలు పంటకు వాడుకుంటే బాగా మన్నిక వస్తాయన్నారు. ట్రీట్‌మెంట్, టెక్నీషియన్ల సాయం కోసం పీడీ రఘునాథరెడ్డి (79950 87057), ఏపీడీ జి.పిరోజ్‌ఖాన్ (94913 25786)ను సంప్రదించాలని కోరారు.

జిల్లాకు 1,225 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఎరువుల ప్రణాళికలో భాగంగా ఆదివారం 1,225 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరింది. ఈ మేరకు ఏడీఏ ఎం.రవి తెలిపారు. స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్ పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియాను ఆదివారం ఆయన పరిశీలించారు. మద్రాస్ ఫర్టిలైజర్స్ కంపెనీ నుంచి 525 మెట్రిక్ టన్నులు అనంతపురానికి, 700 మెట్రిక్ టన్నులు శ్రీసత్యసాయి జిల్లాకు సరఫరా అయిందన్నారు. కలెక్టర్, జేసీ, జేడీఏ ఆదేశాల మేరకు ఇండెంట్ ప్రకారం ఆర్‌బీకేలు, సొసైటీలు, ప్రైవేట్ డీలర్లకు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మిగిలినవి కంపెనీ, మార్క్‌ఫెడ్ గోదాముల్లో నిల్వ చేయనున్నట్లు పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు మార్గదర్శకాలు

- జారీ చేసిన ఎన్నికల సంఘం


కౌంటింగ్ ఏర్పాట్లు, బందోబస్తుపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

అనంతపురం అర్బన్: పోలింగ్ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోవడం... నిర్వహణలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలమైందని పలువురు బహిరంగంగానే విమర్శించారు. ఈ నేపథ్యంలో ఓట్ల లెక్కింపునకు ఎన్నికల సంఘం ప్రత్యేకంగా మార్గదర్శకాలను జారీ చేసింది. 'ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించాలి. ప్రతి ఒక్కరూ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలి. ఏ దశలోనూ వివాదాలకు తావివ్వకూడదు' అని అధికారులకు, సిబ్బందికి ఎన్నిక సంఘం ప్రత్యేకంగా సూచించింది. కౌంటింగ్ ప్రక్రియ, కౌంటింగ్ సమయంలో నిర్వహించాల్సిన విధుల విషయంలో అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేసింది. కౌంటింగ్ ప్రారంభానికి ముందే కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. బందోబస్తు విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించింది.

పటిష్ట బందోబస్తు ఉంటుంది..

కౌంటింగ్ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల వద్దనే కాకుండా కేంద్రాలకు వెళ్లే మార్గంలోనూ పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అనంతపురంలోని సిరికల్చర్ ఆఫీస్ పంగల్ రోడ్డు వద్ద ఉన్న మన్రో విగ్రహం వద్ద నుంచి జేఎన్‌టీయూ వరకు, ప్రసన్నాయపల్లి రహదారి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. అలాగే హిందూపురంలోని బిట్, లేపాక్షి మండలంలోని గురుకుల పాఠశాల కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే మార్గంలోనూ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే అధికారులు, సిబ్బంది, ఇతరులు తప్పనిసరిగా గుర్తింపు కార్డు కలిగి ఉండాలి. 144 సెక్షన్, 133 సెక్షన్ అమలులో ఉంటుంది. విజయం సాధించిన అభ్యర్థులు ఊరేగింపులు నిర్వహించకుండా నిషేధం విధించారు.

- కౌంటింగ్ జరగనున్న జూన్4వ తేదీన తెల్లవారు జాము 4 గంటలకు కౌంటింగ్ సిబ్బంది, అధికారులు కేంద్రాలకు చేరుకోవాలి.
- కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి మూడవ రాండమైజేషన్ నిర్వహించాలి. అటు తరువాత ఎవరు ఏ హాలు, ఏ టేబుల్ వద్ద విధులు నిర్వర్తించాలి అనేది తెలియజేయాలి.
- ముందుగా పోస్టల్ బ్యాలెట్లు లెక్కించాలి. అది ప్రారంభమైన 30 నిమిషాల తరువాత స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్‌లోని టేబుళ్ల వద్దకు సిబ్బంది వెళ్లాలి.
- అభ్యర్థులు లేదా వారి అనుమతి పొందిన వారి సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలను తెరవాలి. ఈవీఎంల సీళ్లను ఏజెంట్ల సమక్షంలో తెరవాలి
- ఫారం 7-ఏలో ఉన్న అభ్యర్థుల వారీగానే ప్రీలోడ్ చేసి ఉన్న ఫారం 17సీలో ఉంటుంది. అందులో అభ్యర్థులకు వచ్చిన ఓట్లను నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని సూక్ష్మ పరిశీలకులు పరిశీలించాలి.
- ఎన్నికల సంఘం పరిశీలకులు రెండు పోలింగ్ కేంద్రాల యూనిట్లను క్రాస్‌చెక్ చేయాలి. ఎన్నికల సంఘం పరిశీలకులు మినహా మరెవ్వరూ కౌంటింగ్ కేంద్రంలోని సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లకూడదు.
- సర్వీస్ ఓట్లకు సంబంధించి ఈటీపీబీల లెక్కింపునకు ఆర్‌ఓ, ఏఆర్‌ఓల సెల్‌ఫోన్‌లకు ఓటీపీ వస్తుంది, కాబట్టి వారు తమ సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లి ఓటీపీ వచ్చాక వాటిని తిరిగి పరిశీలకులకు అందజేయాలి.
- ప్రతి కౌంటింగ్ కేంద్రంలోనూ ల్యాండ్‌ఫోన్ సదుపాయం ఉంటుంది. అత్యవసరమైతే పోలీసు సిబ్బంది వైర్‌లెస్ సెట్ల ద్వారా సంబంధిత అధికారులకు సమాచారం తెలియాలి.
- ప్రతి ఆర్‌ఓకు సహాయకారిగా ఒక జిల్లా అధికారిని ఏర్పాటు చేయాలి. తుది ఫలితాలు ప్రకటించే వరకూ సిబ్బంది కేంద్రాల వద్దనే ఉండాలి.
- కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపును చిత్రీకరించాలి. అవసరమైతే వీడియోగ్రాఫర్లనూ ఏర్పాటు చేయాలి.
- కేంద్రాల వద్ద ఇంటర్నెట్, ల్యాండ్‌లైన్ సౌకర్యం కల్పించాలి. ప్రతి కౌంటింగ్ కేంద్రంలోనూ మైక్ అండ్ సౌండ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి.
- డిజిటల్ స్క్రీన్‌లు, బ్యాటరీతో నడిచే హ్యాండ్‌మైక్‌లు సిద్ధంగా ఉంచాలి. కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలి.

ప్రభుత్వ ఐటీఐలో రేపు జాబ్ మేళా

గుంతకల్లు: స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ టి.రవీంద్రనాథ్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎల్‌అండ్‌టీ, జిందాల్ షా లిమిటెడ్, జాన్సన్ లిఫ్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధుల హాజరై, ఆయా కంపెనీల అవసరాల మేరకు మానవ వనరులను ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం ఐటీఐ చదువుతున్న వారితో పాటు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మోటార్ మెకానిక్ కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న వారు బయోడేటా, మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ తదితర సర్టిఫికెట్లతో పాటు రెండు ఫొటోలు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్, పాన్ కార్డు జిరాక్స్ కాపీలు రెండు సెట్ల వెంటబెట్టుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలి. పూర్తి సమాచారానికి 99492 79880లో సంప్రదించవచ్చు.

అక్రమ కేసులు నమోదు చేయొద్దు

- ఎస్పీ గౌతమిశాలికి విన్నవించిన తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి


ఎస్పీని కలసి బయటకు వస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

అనంతపురం: ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లతో ప్రమేయం లేని వారిపై అక్రమంగా కేసులు బనాయించేందుకు చూస్తున్నారని, వాస్తవాలను గుర్తించి కేసుల నమోదులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలంటూ ఎస్పీ గౌతమిశాలికి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విన్నవించారు. ఈ మేరకు ఎస్పీ గౌతమి శాలిని ఆదివారం ఆయన కలసి వినతిపత్రం అందజేశారు.

అంతా కుట్రపూరితమే...

ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు అందరి సమక్షంలో తన కుమారులు హర్షవర్ధన్‌రెడ్డి, సాయి ప్రతాప్‌రెడ్డి బెంగళూరుకు వెళ్లిపోయారని ఎస్పీకి ఎమ్మెల్యే పెద్దారెడ్డి వివరించారు. ఇందుకు సంబంధించిన వీడియో ఫుటేజీలు తన వద్ద ఉన్నాయన్నారు. పోలీసులు సైతం వారిని దగ్గరుండి పంపించిన ఆధారాలు ఉన్నాయన్నారు. అయితే అదే రోజు మధ్యాహ్నం నాగముని అనే వ్యక్తి వైఎస్సార్‌సీపీ ఏజెంట్‌పై దాడి చేసి, గాయపరిచారని, ఈ విషయం తెలియగానే అప్పటి తాడిపత్రి సీఐ, పోలీసులతో పాటు తానూ అక్కడికి చేరుకున్నానన్నారు. సీఐ, ఇతర పోలీసు అధికారులు సర్ది చెప్పి తనను వెనక్కు పంపించే ప్రయత్నం చేశారన్నారు. అయితే ఇదంతా టీడీపీ నాయకుల కుట్రలో భాగంగానే అని గుర్తించేలోపు తమపై రాళ్లురువ్వారన్నారు. ఈ క్రమంలో సీఐకి గాయాలయ్యాయని, అదే రోజు సాయంత్రం తన ఇంటిపై దాడికి యత్నించారని వివరించారు. తన కుమారులు ఇద్దరూ లేకపోయినా వారిపై అక్రమంగా కేసులు బనాయించారన్నారు.

ధర్మవరం నేతలకు సంబంధం లేదు..

తనపై జరిగిన దాడి విషయం తెలుసుకుని స్వయాన తన అన్న కుమారుడు, ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి పరామర్శించేందుకు తన ఇద్దరు గన్‌మెన్‌లను వెంటబెట్టుకుని వచ్చారన్నారు. ధర్మవరం ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేతలు మరికొందరు కూడా వచ్చారన్నారు. అయితే తాడిపత్రిలో చోటు చేసుకున్న అల్లర్లకు వీరికి ఎలాంటి సంబంధమూ లేదన్నారు. కేవలం పరామర్శించేందుకు వచ్చిన వారిపై అక్రమంగా కేసులు బనాయించాలని చూస్తున్నారన్నారు. ఈ విషయంలో మరింత లోతైన విచారణ చేపట్టి తాడిపత్రి అల్లర్లకు సంబంధం లేని ధర్మవరం వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు నమోదు చేయకుండా చూడాలని కోరారు. అలా కాదని కేసులు బనాయిస్తే న్యాయపోరాటానికి సిద్ధమని పేర్కొన్నారు.

భూతద్దంలో చూడొద్దు..

తాడిపత్రి నియోజకవర్గ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను భూతద్దంలో పెట్టి చూడాల్సిన పని లేదన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ జరిగేలా తాము సహకరిస్తామన్నారు. ఈ విషయంగా ఇప్పటికే పార్టీ కార్యకర్తలు, నేతలకు దిశానిర్దేశం చేశామన్నారు. ఎస్పీని కలసిన వారిలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా నాయకుడు ఎం.సత్యనారాయణరెడ్డి, తదితరులు ఉన్నారు.

బోరు విషయంలో ఘర్షణ.. ఒకరి మృతి


మృతుడు లక్ష్మీనారాయణరెడ్డి

నార్పల: బోరు విషయంలో చోటు చేసుకున్న ఘర్షణలో గుండెపోటుకు గురై ఓ రైతు మృతి చెందాడు. వివరాలు... నార్పల మండలం జంగంరెడ్డిపల్లికి చెందిన కొవ్వూరు లక్ష్మీనారాయణరెడ్డి(57)కి తుంపెర వద్ద పొలం ఉంది. తన పొలంలోని బోరుకు నీరు రాకపోవడంతో దుగుమర్రి చెరువు వద్ద నాలుగురోజుల క్రితం బోరు వేశాడు. నీరు లభ్యం కావడంతో ఆదివారం బోరుబావిలోకి మోటారు దింపుతుండగా తుంపెర గ్రామానికి చెందిన మంజుల రమణ, ఆయన కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. లక్ష్మీనారాయణరెడ్డి వేసిన బోరు పాయింట్ తమ పొలం హద్దులోకి వస్తుందని వాగ్వాదానికి దిగారు. ఆ సమయంలో ఒకరినొకరు తోసుకోవడంతో లక్ష్మీనారాయణరెడ్డి కిందపడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు వెంటనే నార్పల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన గుండెపోటుకు గురై మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు కుళ్లాయిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రమణ, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెంకటశివారెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

పీఠాధిపతి పర్యటన రద్దు

అనంతపురం కల్చరల్: పుష్పగిరి శంకరాచార్య మహా సంస్థాన పీఠాధిపతి జగద్గురు విద్యాశంకర భారతీ మహాస్వామి అనంత పర్యటన అనివార్య కారణాలతో రద్దయినట్లు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయం అనువంశిక ధర్మకర్త హోసూరు రామసుబ్రహ్మణ్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామీజీ మొదటి రోడ్డులోని శివాలయానికి విచ్చేసి అనుగ్రహ భాషణం చేయాల్సి ఉండగా.. నేరుగా మైసూరు వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. అందుచేత స్వామీజీ రాలేకపోయారన్నారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు.

కార్తికేయుడికి పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి బంగారు కవచాన్ని ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాలసర్పదోష నివారణ రాహుకేతు హోమాలు చేపట్టారు. ఆలయంలోని మంజునాథ స్వామి, పార్వతి దేవికి విశేష పూజలు చేశారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

'ఇన్ఫినిటి' ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం



పాఠశాలను ప్రారంభిస్తున్న చెన్నై ఐఐటీ సాంఖ్యాకశాస్త్ర ఆచార్యుడు అరుణ్ తంగిరాల

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఆదర్శ నగర్‌లో 'ఇన్ఫినిటి' ఇంటర్నేషనల్ స్కూల్ ఆదివారం ప్రారంభమైంది. చెన్నై ఐఐటీ సాంఖ్యాకశాస్త్ర ఆచార్యుడు కె.అరుణ్ తంగిరాల, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ శశిధర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు శాస్త్రీయ, సాంకేతిక, సంస్కృతిక విద్య సమపార్జన చేయడం ముఖ్యం అని అరుణ్ తంగిరాల పేర్కొన్నారు. ఈ పాఠశాల ద్వారా అన్ని సౌకర్యాలతో పాటు మంచి గుణాత్మక విద్య అందించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం టి.లక్ష్మీదేవి, మల్లికార్జున, ప్రిన్సిపల్ రాజేశ్వరి, ఎం.భార్గవి తదితరులు పాల్గొన్నారు.

కార్ల విక్రయాల్లో రికార్డు



వాహనదారుడికి తాళం అందజేస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్: జాతీయ రహదారిలోని ఎంజీబీ మొబైల్స్ షోరూంలో ఆదివారం ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ మోడల్ వాహనాలను ఒకేరోజు 30 డెలివరీ చేసి రికార్డు సృష్టించామని ఎంజీబీ మొబైల్స్ సీఈఓ ఆదిత్య మాచాని, సేల్స్ జనరల్ మేనేజర్ వంశీకృష్ణ, మేనేజర్ మస్తాన్‌వలీఖాన్ తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇది అనంతపురంలో సరికొత్త బెంచ్ మార్కు అని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడికి గాయాలు



దెబ్బతిన్న బాలుడి కుడి కాలు

కణేకల్లు: మండల కేంద్రంలోని దిగువవీధిలో ఆర్టీసీ బస్సు ఢీకొని యశ్వంత్ అనే బాలుడికి కాలు నుజ్జునుజ్జయ్యింది. వివరాలు.. పెద్దవడుగూరు మండలం ముప్పాలగుత్తికి చెందిన మీనాక్షి, రామాంజనేయులు కణేకల్లులో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చారు. ఇంటిముందున్న మెయిన్‌రోడ్డులో కొంతస్థలంలో షామియానా వేశారు. ఈసమయంలో ఆర్టీసీ బస్సు కణేకల్లు నుంచి ఉరవకొండకు వెళ్తోంది. అక్కడే ఉన్న బాలుడు రోడ్డుపైకి వచ్చాడు. దీంతో బాలుడి కుడికాలుపై బస్సు చక్రం వెళ్లడంతో పాదం నుజ్జునుజ్జయ్యింది. ప్రథమ చికిత్స అనంతరం బాలుడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కుక్క దాడిలో గాయాలు

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఆదివారం రాత్రి రోడ్డు పక్కన నిలుచుని ఉన్న వెంకటరాముడు, మంజునాథ్‌పై ఓ కుక్క దాడి చేసింది. కుక్క దాడిలో గాయపడిన వారిని స్థానికులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమచికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి



జార్జ్‌పేటలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది



బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికుడు



దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

- నగరపాలక సంస్థ ముందస్తు చర్యలు
- దోమకాటు ప్రభావిత ప్రాంతాల్లో మెలాథిన్ పిచికారీ
- 8 చిన్న మిషన్ల ద్వారా ముమ్మరంగా ఫాగింగ్

అనంతపురం కార్పొరేషన్: నగరంలో గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పాలకవర్గం, నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో నగరంలోని 50 డివిజన్లలో ఫాగింగ్, స్ప్రేయింగ్ ప్రారంభించారు. దోమకాటు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించారు. షిఫ్టుల ప్రకారం ఉదయం స్ప్రేయింగ్, సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేపడుతున్నారు. ప్రస్తుతం నగరపాలక సంస్థ పరిధిలో రెండు పెద్ద ఫాగింగ్ మిషన్లు చెడిపోయాయి. అందుబాటులో ఉన్న 8 చిన్న మిషన్ల ద్వారా ఫాగింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా ఫాగింగ్, స్ప్రేయింగ్‌కు సంబంధించిన మెలాథిన్, డీజిల్ సమతుల్యంగా ఉంది. నగరంలోని పాతూరు, 3, 4, 5, జార్జ్‌పేట్, ఆజాద్ నగర్, తదితర ప్రాంతాల్లో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేపడుతున్నారు.

రెండు డెంగీ కేసులు..

నగరంలో ఇప్పటికే రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. నగరంలోని ద్వారకా నగర్‌లో 18 ఏళ్ల యువకుడు డెంగీ బారినపడ్డాడు. నాల్గవ రోడ్డు అమ్మవారి దేవాలయం సమీపంలో ఉన్న ఓ 48 ఏళ్ల మహిళకు డెంగీ నిర్ధారణ అయ్యింది. దీంతో నగరపాలక సంస్థ అప్రమత్తమైంది. ఆయా ప్రాంత్రాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేసింది.

డ్రై డే పాటించాలి

వర్షాలు కురుస్తుండటంతో దోమకాటు వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో దోమకాటు నివారణ చేపట్టేలా సిబ్బందికి సూచించాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నగరంలో పారిశుధ్య పనులు ముమ్మరం చేశారు. దోమల వ్యాప్తి అధికంగా ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించేలా అధికారులకు సూచించాం. ప్రజలు సైతం వారంలో ఒక రోజు డ్రై డేగా పాటించాలి. ఇంటితో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మస్కిటో కాయిల్స్, దోమ తెరలు వాడాలి. – వసీం, మేయర్

మార్మోగిన హరినామ సంకీర్తన

- భక్తిశ్రద్ధలతో సాగిన సంకీర్తన మహాయజ్ఞం



టవర్‌క్లాక్ వద్ద నుంచి ప్రారంభమైన ఇస్కాన్ సంకీర్తన యజ్ఞం

అనంతపురం కల్చరల్: హరే కృష్ణ.. హరే రామ అంటూ హరినామ సంకీర్తనతో అనంత పురవీధులు మార్మోగాయి. ఆధ్యాత్మిక భక్తిభావాన్ని ప్రచారం చేస్తూ ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం నగర వీధుల్లో సంకీర్తనా మహా యజ్ఞం ఘనంగా సాగింది. స్థానిక టవర్‌క్లాక్ వద్ద ఉన్న పురాతన వేణుగోపాల స్వామి ఆలయంలో ఉదయం సామూహిక హరినామ జపం జరిగింది. అనంతరం సంప్రదాయ వాయిద్యాలతో ఇస్కాన్ సభ్యులు శ్రీధర్ ప్రభు, శ్రీనివాస ప్రభు ఆధ్వర్యంలో ఆనందతాండవం చేస్తూ మధురమైన సంకీర్తనలు ఆలపిస్తూ భక్తిభావంలో ముంచెత్తారు. ఈ సందర్భంగా వారు నగరవాసులకు కృష్ణతత్వాన్ని వివరించారు. అనంతరం నగర శివారులోని ఇస్కాన్ మందిరం చేరుకుని రాధా పార్థసారథులకు ప్రత్యేక సేవలు, అలంకారం చేసి పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు మాట్లాడుతూ.. భక్తిమార్గంలోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ప్రజలందరిలో ఆ మానసికానందాన్ని కల్గించడానికే నగర సంకీర్తనా యజ్ఞం సాగుతుందన్నారు. చైతన్యమహాప్రభు సంకీర్తనల ద్వారా విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి తోడ్పడ్డారని అదే బాటలో ఇస్కాన్ పయనిస్తోందని తెలిపారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం జరిగింది.

అనారోగ్యంతో ఉప సర్పంచ్ మృతి



అశోక్ కుమార్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని పి.యాలేరు గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ అశోక్ కుమార్ (50) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ బలోపేతానికి అశోక్ కుమార్ చాలా కృషి చేశారు. అశోక్‌కుమార్ మరణించిన విషయం తెలుసుకున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అశోక్ కుమార్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. అలాగే పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించారు.

చదువు ప్రాముఖ్యతను గుర్తించాలి



పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో గవిమఠం ఉత్తరాధికారి, వీరశైవ లింగాయత్ నాయకులు

- గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్ర స్వామి

ఉరవకొండ: దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలంటే చదువు ఎంతో ముఖ్యమని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ శ్రీ కరిబసవరాజేంద్ర స్వామి పేర్కొన్నారు. చదువు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఆదివారం స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో ఉరవకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో 2023–24లో పదో తరగతి చదివి 60శాతానికి పైగా మార్కులు సాధించిన వీరశైవ లింగాయత్ విద్యార్థిని, విద్యార్థులకు నగదు, షీల్డ్, ప్రశంసా పత్రాల పురస్కారాలు అందించారు. తాలుకా వీరశైవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ఉత్తరాధికారితో పాటు వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాల్తూరు దండిన శివానంద, జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షులుడు బండయ్య, సభా అధ్యక్షుడు కె.మల్లికార్జున, అమ్మతొలి దైవం అధ్యక్షుడు పాటిల్ రాజశేఖర్, చంద్రిక మల్లికార్జున, వెలిగొండ గంగాధర్, పాటిల్ నిరంజన్‌గౌడ్, శంకర్‌గౌడ్, నాగన్నగౌడ్, దేశాయివిరేష్, ఎర్రిస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు. పురస్కారాలకు ప్రభుత్వ పాఠశాలలో చదవిన 17 మందిని ఎంపిక చేసి వారికి నగదుతో పాటు షీల్డ్, ప్రశంసా ప్రతాలు అందించారు.

90 శాతం రాయితీతో విత్తనాలు ఇవ్వాలి

కనగానపల్లి: ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం 90 శాతం రాయితీతో విత్తనాలు, ఎరువులు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు మహదేవ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన రైతు సంఘం నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడారు. గత సంవత్సరం నెలకొన్న కరువు పరిస్థితుల వల్ల పంటలు పండక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ఏడాది వేరుశనగ పంట సాగుచేసేందుకు విత్తనాలు, ఎరువులు కొనేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిని గుర్తించి ప్రభుత్వం వేరుశనగతో పాటు కంది, ఆముదం, పత్తి వంటి విత్తనాలను 90 శాతం సబ్సిడీతో అందించాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు గోవిందు, బాలరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

భౌ బోయ్..!

- ఆగని కుక్కల బెడద
- గత మూడు నెలల్లో జీజీహెచ్‌లో 2 వేలకు పైగా కేసుల నమోదు



మారుతీ నగర్‌కు చెందిన ఓ బాలుడికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న స్టాఫ్‌నర్స్ (ఫైల్)

అనంతపురం మెడికల్: నగరంలో కుక్కల బెడద ఎక్కువైంది. ఎక్కడ చూసినా కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. పలుచోట్ల కుక్కల దాడిలో గాయపడిన వారు ప్రభుత్వ సర్వజనాస్పత్రి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కుక్కలకు స్టెరిలైజేషన్ చేసే ప్రక్రియ వాయిదా పడడంతో ఈ సమస్య మరింత తీవ్ర రూపం దాల్చుతోంది. నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ కుక్కల బెడద సమస్యకు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.

2,492 మందికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్..

ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఈనెల 25వ తేదీ వరకు జీజీహెచ్‌లో 2,492 మంది కొత్త వారికి యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఇంజెక్షన్ ఓపీ (నంబర్–1)లో 596 మంది యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేయించుకున్నారు. అందులో 351 మంది పురుషులు, 145 మంది మహిళలు, 72 మంది మగ పిల్లలు, 28 మంది ఆడపిల్లలు ఉన్నారు. మార్చిలో 603 మంది, అందులో 361 మంది పురుషులు, 129 మంది మహిళలు, 87 మంది మగ పిల్లలు, 26 ఆడ పిల్లలు ఉన్నారు. ఏప్రిల్‌లో 678 మంది వ్యాక్సిన్ వేయించుకోగా.. అందులో 375 మంది పురుషులు, 166 మంది మహిళలు, 93 మంది మగ పిల్లలు, 44 మంది ఆడ పిల్లలు ఉన్నారు. ఈనెలలో ఇప్పటి వరకు 615 మంది కుక్కకాటుకు గురయ్యారు. అందులో పురుషులు 327, మహిళలు 154, మగ పిల్లలు 91, ఆడపిల్లలు 43 మంది ఉన్నారు. అనంతపురం, శింగనమల, రాప్తాడు నియోజకవర్గం నుంచి కుక్కకాటు బాధితులు జీజీహెచ్‌కు వస్తున్నారు. వీరిలో 70 నుంచి 90 శాతం మంది అనంతపురం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల వారు ఉన్నట్లుగా రికార్డుల్లో నమోదైనట్లు తెలుస్తోంది. మారుతీనగర్, రాంనగర్, బుడ్డప్పనగర్, అశోక్‌నగర్, సాయినగర్, 1, 2, 3, 4, 5 రోడ్లు, ఆజాద్ నగర్, హౌసింగ్ బోర్డు, నాయక్ నగర్, తదితర ప్రాంతాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నారు.

స్టెరిలైజేషన్ ప్రక్రియకు బ్రేక్..

గతంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కుక్కలకు స్టెరిలైజేషన్ చేసే పరిస్థితి ఉండేది. వివిధ కారణాలతో ఆ పనులకు బ్రేక్ పడింది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు దిశగా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

నివారణ చర్యలు తీసుకుంటాం

కుక్కకాటు నివారణ చర్యలు తీసుకుంటాం. అనిమల్ బర్త్ కంట్రోల్ మార్గదర్శకాల ప్రకారం స్టెరిలైజేషన్ చేసేలా ఏజెన్సీకి తెలియజేశాం. త్వరలో స్టెరిలైజేషన్ ప్రక్రియ మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటాం. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – మేఘ స్వరూప్, కమిషనర్

బాట మారెమ్మకు ప్రత్యేక పూజలు



అలంకరణలో బాట మారెమ్మ

కనగానపల్లి: మండల కేంద్రానికి సమీపంలో వెలసిన బాట మారెమ్మ దేవతకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రతి ఆది, మంగళ, శుక్ర వారాల్లో అమ్మవారిని వందలాది మంది దర్శించుకుంటారని ఆలయ పూజారి తెలిపారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన బందేనవాజ్ ఉరుసు

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం వద్ద హజరత్ ఖాజా బందేనవాజ్ గ్రేస్ దాస్ దర్గాలో మూడో రోజు ఆదివారం జియారత్‌తో ఉరుసు ఘనంగా ముగిసింది. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఉరుసు నిరాడంబరంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు దర్గాలో ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు ఆఫ్జల్ బాషా, ఖలీల్, రషీద్, సైదు, రహంతుల్లా, డిష్ ఖాసీం, షఫి, రఫి, పాషా, నబి తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యతో నూతన ఆవిష్కరణలు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు



మాట్లాడుతున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాణిక్య రావు

అనంతపురం మెడికల్: నిరంతర వైద్య విద్యతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది. తద్వారా రోగులకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు పేర్కొన్నారు. ఆదివారం ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ వైద్య కళాశాలలో జీజీహెచ్ ఎమర్జెన్సీ మెడిసిన్, కిమ్స్–సవీరా ఆధ్వర్యంలో ఎమర్జెన్సీ మెడిసిన్ నిరంతర వైద్య విద్య (సీఎంఈ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్య కళాశాలలో వివిధ విభాగాలకు సంబంధించి నిరంతర వైద్య విద్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉండాలని సూచించారు. తద్వారా రోగికి సులభతరంగా, అత్యాధునిక వైద్య సదుపాయాన్ని అందించవచ్చని తెలిపారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ప్రవేశపెట్టిన ఎమర్జెన్సీ మెడిసిన్ ద్వారా క్షతగాత్రులు, పాయిజన్ కేసులు, తదితర ప్రాణాంతక కేసులకు సకాలంలో వైద్యం అందించి వారిని ప్రాణాల కాపాడడంతో ఎమర్జెన్సీ వైద్యుల పాత్ర కీలకమన్నారు. ఎమర్జెన్సీ వార్డుకు(క్యాజువాలిటీ) సర్జరీ, ఆర్థో, మెడిసిన్, తదితర విభాగాలకు సంబంధించిన కేసులు వస్తుంటాయని తెలిపారు. అటువంటి పరిస్థితుల్లో ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు హాజరై రోగుల ఆరోగ్యం కుదుట పడేలా వైద్య చికిత్సలందిస్తారన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ మెడిసిన్ ద్వారా రోగులకు మెరుగైన వైద్యం అంది, ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం పటిష్టంగా ఉందని గుర్తు చేశారు. రోగులకు సత్వర వైద్యం అందిస్తున్నారని ముందు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసులు, కిమ్స్–సవీరా మేనేజింగ్ పార్ట్‌నర్ ఎస్‌వీ కిషోర్ రెడ్డి, 200 మంది వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



దామాజిపల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా సోదాలు చేస్తున్న పోలీసులు



ఎర్రోనిపల్లిలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు

చెన్నేకొత్తపల్లి: గ్రామాల్లో అనవసరంగా గొడవలకు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామని రామగిరి సీఐ శివాంజనేయులు హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని దామాజిపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అల్లర్లకు ప్రేరేపించే వారు, పాత లిక్కర్ కేసులు ఉన్న వారి ఇళ్లను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డులు సరిగా లేని ఐదు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 4వ తేదిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వస్తాయని తెలిపారు. ఆ రోజున ఎలాంటి గొడవలకు వెళ్లకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారైనా వదిలేది లేదని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అంతకు ముందు గ్రామంలోని ప్రధాన రహదారుల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు..

మండల పరిధిలోని ఎర్రోనిపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం పోలీసులు గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామంలో ఇరు పార్టీల వారు శాంతియుతంగా జీవించాలన్నారు.

ముగిసిన ఏటిగంగమ్మ తిరునాల



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న బలిజపేట వాసులు

తలుపుల: మండల కేంద్రంలోని ఎగువపేట సమీపంలో ఉన్న ఏటి గంగమ్మ ఆలయం వద్ద నాలుగు రోజుల పాటు సాగిన తిరునాల ఆదివారం ముగిసింది. ఏటా మొలకల పౌర్ణమి సందర్భంగా ఏటి గంగమ్మ తిరునాల నిర్వహించడం ఆనవాయితీ. ఈనెల 23న అమ్మవారికి చీర సారె కార్యక్రమాలతో ప్రారంభమై తిరునాల హరికథా కాలక్షేపాలతో పాటు, బలిజ పేట చాందిని బండి ఊరేగింపు ప్రత్యేక అకర్షణగా నిలిచింది. ఆదివారం బలిజపేట వాసులు బోనాలతో ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని సమర్పించారు. అనంతరం జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మండల వాసులే గాక కదిరి, పులివెందుల, ఎన్‌పీకుంట, చక్రాయపేట మండలాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. తిరునాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ దిలీప్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

యువకుడు అదృశ్యం



పవన్ కుమార్ (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్: పట్టణంలోని మారంపల్లి కాలనీకి చెందిన పూజారి పవన్‌కుమార్ అనే యువకుడు శనివారం ఉదయం నుంచి కనపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదృశ్యం అయిన పవన్ కుమార్ రాయదుర్గంలో పాలిటెక్నిక్ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. పవన్ కుమార్ ఆచూకీ తెలిసిన వారు సెల్: 8309620777, 8985598183 ఈ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు కోరారు.

ఒకరికి తీవ్ర గాయాలు

కదిరి టౌన్: పట్టణంలోని జీవిమాను సర్కిల్ సమీపంలో ద్విచక్రవాహనం పై నుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణానికి చెందిన వలీ జీవిమాను సర్కిల్ నుంచి మదనపల్లి వైపు బయలుదేరాడు. ఈక్రమంలో కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ హాళ్లలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్ సూచించారు. ఆదివారం జేఎన్‌టీయూను సందర్శించి అక్కడ కౌంటింగ్ హాళ్లలో చేపట్టిన పనులను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద బందోబస్తును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.